సాక్షి

అన్నమయ్య జిల్లా

బుధవారం । 22 । మే । 2024



గడువు దాటిన సిలిండర్‌తో జాగ్రత్త!
కాలం చెల్లిన గ్యాస్ సిలిండర్ వినియోగిం చడం ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం నుంచి బయటపడే అవకాశం ఉంది. -8లో



పంట మారుద్దాం.. దిగుబడి పెంచుదాం
రైతులు ఏటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే వీలుంటుంది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.160	రూ.248



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 557 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	400
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 19.620 కిలోలు

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

రాయచోటి: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య తెలిపారు. మంగళవారం రాయచోటిలోని జూనియర్ కళాశాల (బాలికలు)లో పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిటెండెంట్ అధికారులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షా సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. ఈనెల 24వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 14415 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో మొదటి సంవత్సరం 10029 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 4386 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లా ఎగ్జామ్ కమిటీ సభ్యులు ప్రకాష్, అమరేంద్ర కుమార్ నాగ సురేష్ పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు



రాయచోటి ఉప ఖజానా కార్యాలయం నుంచి బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న దృశ్యం

రాయచోటి టౌన్: రాయచోటి ఉప ఖజానా కార్యాలయంలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాకులు మాసాపేటలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంకు తరలించారు. మంగళవారం రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రంగస్వామి పర్యవేక్షణలో పోలీసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, అన్ని పార్టీలకు చెందిన నాయకుల సమక్షంలో రాయచోటి ఉప ఖజానా కార్యాలయంలో భద్ర పరిచిన 2024 సార్వత్రిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ బాక్సులు తనిఖీ చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్ట్రాంగ్ రూమ్‌కు తీసుకెళ్లారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేటలో జరిగిన లోక్ సభ, అసెంబ్లీలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను మంగళవారం రాయచోటికి తరలించారు. రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. వచ్చేనెల 4న కౌంటింగ్ ప్రక్రియ ఉన్న నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ట్రెజరీలో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ప్రత్యేక వాహనంలో జిల్లా కేంద్రానికి తరలించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ ఇన్నునాథం, పట్టణ సీఐ మద్దయ్య ఆచారి, వివిధ పార్టీల ఏజెంట్లు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు పదానికి జన్మదినం..

జానపదానికి జ్ఞానపథం

అదివో అల్లదివో శ్రీవారి వాసము పదివేల శేషుల పడగలమయం... లాంటి కీర్తనలతో పదకవితా పితామహుడుగా తాళ్ల పాక అన్నమాచార్యులు శ్రీవారి భక్తుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నాడు. అన్నమాచార్యుడి 614వ జయంతి సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం...

- తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య
- రేపటి నుంచి అన్నమాచార్యుని జయంతి ఉత్సవాలు
- అటు తాళ్లపాక, ఇటు 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద ఉత్సవాలు



తాళ్లపాకలోని అన్నమాచార్య ధ్యానమందిరం

రాజంపేట: తెలుగుసాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు అన్నమయ్య. ఆయనకు పదకవితాపితామహుడు అని బిరుదు ఉంది. దక్షిణాపథంలో భజన సంప్రాదాయానికి పదకవితాశైలికి ఆద్యుడు. గొప్ప వైష్ణవభక్తుడు..

- భాగవతసేవా పరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానం లేకపోవడంతో ఏడుకొండలస్వామిని మొక్కుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఈ దంపతులు స్వామి మందిరంలోకి ప్రవేశించారు. గరుడస్తంభం వద్ద సాగిలి మొక్కారు. వెంకటేశ్వర స్వామి తన నిజఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్యదంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానంద భరితులయ్యారు. వెంకటపతిని దర్శించి స్తుతించారు. సంతోషంతో తాళ్లపాకకు తిరిగివచ్చారు. 1408 మే 9న రాజంపేట మండలం తాళ్లపాకలో అన్నమయ్య జన్మించాడు. తన ఎనిమిదవ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘన విష్ణుదీక్ష నొసిగినప్పుడు అన్నమాచార్య నామం స్థిరపడింది.



ఈ ఫోటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు శ్రీహరి నారాయణ చార్యులు. ఈయనను తాళ్ల పాక స్వామి అని కూడా పిలుస్తారు. 12వ తరానికి చెందిన వారు. వీరి కుటుంబీకులు తిరుమలలో శ్రీవారి ఆలయంలో సంకీర్తన కైంకర్యపరులుగా కొనసాగుతున్నారు. అన్నమయ్య వారసులుగా శ్రీవారి నిత్య కైంకర్యాలలో చేసుకునే మహాభాగ్యం మా కుటుంబీకులకు మహాఅద్భుతమైన అవకాశంగా భావిస్తున్నామని హరిస్వామి చెబుతున్నారు.

అన్నమయ్య తిరుమల పయనం..
అన్నమయ్య ఇంటిలో తల్లి సంగీతం, తండ్రి పాండిత్యం ఛాయలతో పెరిగాడు. ఉపవీత సంస్కారం పొందిన తర్వాత ఇంటి గురుకులంలో విద్యాభ్యాస్యం కొనసాగింది. ఏకసంధాగ్రాహి అయినందున అనతికాలంలో ఉన్నత విద్యావంతుడయ్యాడు. తన పదహారవ యేట అన్నమయ్యకు శ్రీ వెంకటేశ్వర దర్శనానుభూతి కలిగింది. అప్పటి నుంచి అన్నమయ్య అద్భుతమైన కీర్తనలు రచింపసాగాడు. వేడుకుందామా వెంకటగిరి వెంకటేశ్వరుని..అంటూ భక్తబృందంతో కలిసి అన్నమయ్య తిరుమలకు పయనమయ్యాడు. వెంకటేశ్వరుని కీర్తిస్తూ తిరుమలలోనే జీవితం గడిపాడు.

సంసారం..సంకీర్తనం
తిరుమల నుంచి తాళ్లపాకకు చేరుకున్న అన్నమయ్యకు తిమ్మక్క, అక్కమ్మ అనే పడతులతో వివాహం జరిగింది. వైవాహిక జీవితంలో పడిన అన్నమయ్య ఒకరోజు తన ఇద్దరు భార్యలతో తిరుమలకు చేరుకున్నారు. ఆ సమయంలోనే శ్రీ వేంకటపతిపై రోజుకొక సంకీర్తన వినిపించాలని సంకల్పించాడు. అప్పటి నుంచి అన్నమయ్య పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పారు. అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించారు. భార్యలతో కలిసి తీర్థయాత్రలకు బయలుదేరారు. ముందుగా తన స్వగ్రామంలోని చెన్నకేశవుని అర్చించారు. మార్గంలోని నందలూరు సౌమ్యనాథుడు, ఒంటిమిట్ట రామయ్య, కడప వెంకటరమణుని, చాగలమర్రి చెన్నకేశవున్ని, అహోబిలం నృసింహస్వామిలను దర్శించుకుని కీర్తనలు ఆలపించారు. వైష్ణవ క్షేత్రాలను దర్శించుకుంటూ, తను ఆలపించిన కీర్తనలు అంతటా ప్రసిద్ధి చెందాయి.



అన్నమయ్య కీర్తనలు..రచనలు..
అన్నమయ్య సంకీర్తనా సేవ సంగీత, సాహిత్య, భక్తి పరిపుష్టం. తెలుగు వ్యావహారిక భాష, దేశి సంగీత విధానాలు రెండు అతని రచనలలో ఉన్నాయి. లభించిన వాటిలో తొలి సంకీర్తనలు కనుక అన్నమయ్య సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు అయ్యాడు. 32వేల కీర్తనలు ఆలపించారు. అలుమేలు మంగ, శ్రీనివాసుల కీర్తనలకు తన జీవితాన్ని అంకితం చేసిన పరమ భక్తుడు అన్నమ య్య. రచనలలో భక్తి, సంగీతం, సాహిత్యం, శృంగారం, వేదాంతము అత్యంత మనోహరంగా వినసొంపుగా ఉన్నా యి. దక్షిణాపథంలో భజన సంప్రదా యానికి అన్నమయ్యే ఆద్యుడు.

23 నుంచి 25 వరకు అన్నమయ్య జయంత్యుత్సవాలు
ఈనెల 23 నుంచి 25 తేదీ వరకు అన్నమయ్య 616వ జయంత్యుత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది. తాళ్లపాక, అన్నమయ్య 108 విగ్రహం వద్ద సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 23న తాళ్లపాకలో అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద ఉదయం 9 గంటలకు గోష్టిగానం, సప్తగిరి సంకీర్తనలు ఉంటాయి. 10.30 గంటలకు శ్రీవారి కళ్యాణం నిర్వహించనున్నారు.

భూమన, వైవీ సుబ్బారెడ్డి హయాంలో జన్మస్థలికి మహర్దశ: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలికి మళ్లీ మహర్దశ కలిగిందనే చెప్పవచ్చు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం ఏర్పాటు జరిగాయి. నభూతో నభవిష్యతి అన్న రీతిలో అన్నమయ్య 600వ జయంత్యుత్సవాలు జరిగాయి. సీఎం వైఎస్ జగన్ పాలనలో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి, ప్రస్తుత చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మళ్లీ ఊపిర్లు, అన్నమయ్య ధ్యానమందిర పునఃనిర్మాణానికి మోక్షం లభించింది.

పేరు: తాళ్లపాక అన్నమాచార్యులు
జననం: 1408 మే 09
మూలం: తాళ్లపాక
మరణం: 1503 ఫిబ్రవరి 23, తిరుపతి
సంగీతశైలి: కర్ణాటక సంగీతం
వృత్తి: రచయిత, యోగి, స్వరకర్త, కవి, పదకవితాపితామహుడు
వాయిద్యాలు: తంబూర

అన్నమయ్య నడయాడిన ప్రాంతం పుణ్యస్థలి



తాళ్లపాక అన్నమాచార్యులు నడియాడిన ప్రాంతం పుణ్యస్థలం. అన్నమాచార్యుల జన్మస్థలి అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానాలు కృషి చేస్తున్నాయి. అలుమేలు మంగ, శ్రీనివాసుల కీర్తనలకు తన జీవితాన్ని అంకితం చేసిన పరమభక్తుడు అన్నమయ్య. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన 108 అడుగుల అన్నమయ్య అడుగుల విగ్రహం రాజంపేటకే ల్యాండ్‌మార్క్‌గా నిలిచింది. ఇప్పుడు శ్రీవారి ఆలయం నిర్మాణం భక్తులకు వరం.
–మేడా రామకృష్ణారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ మెంబర్, రాజంపేట

మూడురోజుల పాటు జయంత్యుత్సవాలు



మూడు రోజులపాటు తాళ్లపాక, 108 అడుగుల అన్నమయ్య విగ్రహం వద్ద పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు జయంత్యుత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే సంస్కృతి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అన్నమయ్య జన్మస్థలిలో తొలిరోజున శ్రీవారి కళ్యాణం నిర్వహించనున్నారు.
–నటేష్‌బాబు, డిప్యూటీ ఈఈ, టీటీడీ, తాళ్లపాక

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి: వేసవి దృష్ట్యా జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శికి వివరించారు. మంగళవారం విజయవాడలోని క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ సరఫరా, ఎస్ఆర్ఈజీఎస్ ద్వారా కరువు మండలాల్లో వేజ్ జనరేషన్, స్వచ్ఛ భారత్ మిషన్, గ్రామీణ నీటి సరఫరా ద్వారా తాగునీటి ఎద్దడి నివారణ, శాంతిభద్రతలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రస్తుతం జిల్లాలో రాయచోటి, సుండుపల్లె, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, బి.కొత్తకోట, రామసముద్రం, పీలేరు నియోజకవర్గాలలో 13 మండలాలలో తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున బోర్ వెల్స్, హ్యాండ్ పంప్స్ రీచార్జ్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షణ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉపాధి పనులను విరివిగా చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారులకు సూచించారు. ముఖ్యంగా కరువు మండలాలలో ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే ఆమోదం పొందిన సెల్ఫ్ ఆఫ్ గ్రూప్ పనులను ముమ్మరం చేయాలన్నారు. హౌసింగ్ లో 90 రోజుల పనులు పూర్తయిన వాటికి బిల్లుల చెల్లింపులు వేగవంతం చేయాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా వ్యక్తిగతంగా ఇళ్లముందు సోక్ పిట్ ఏర్పాటు చేసుకునేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగుతుందని డిమాండ్ మేరకు సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఫలితాల అనంతరం జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉండేలా తగిన పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినోదం.. విజ్ఞానం

సమ్మర్ స్పెషల్



అష్టాచెమ్మా ఆడుతున్న చిన్నారులు



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

- వేసవి సెలవులు ఇలా కానిద్దాం
- సెల్‌ఫోన్ బంధం దూరం చేద్దాం
- విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహించాలి

మదనపల్లె సిటీ: ఎల్‌కేజీ నుంచి ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థుల వరకూ వార్షిక పరీక్షలు పూర్తయ్యాయి. అందరికీ వేసవి సెలవులు ఇచ్చేశారు. సాధారణంగా ఒకట్రెండు రోజుల సెలవులంటేనే పిల్లల ముఖాల్లో సంతోషం కనిపిస్తుంది. ఇక వేసవి సెలవులంటే ఆ ఆనందమే వేరు. అయితే ఇప్పుడు పిల్లలు ఏ మాత్రం ఖాళీ దొరికినా స్మార్ట్ ఫోన్లకు అతుక్కుపోతున్నారు. వీరిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సమయంతో పాటు ఆరోగ్యాన్ని హరించేస్తోంది. రుగ్మతల బారిన పడేలా చేస్తోంది. చెడు ప్రభావాల దారి చూపుతోంది. ఈ నేపథ్యంలో ఈ కాలాన్ని పిల్లలు ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. తల్లిదండ్రుల బాధ్యత ఏంటి తదితర అంశాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం..

కుటుంబ సభ్యులతో గడపాలి: తల్లిదండ్రులు కాస్త ఓపికతో పిల్లలను కుటుంబ సభ్యులతో మమేకమయ్యేలా చూడాలి. వీలైతే నాన్నమ్మ, అమ్మమ్మ, తాతయ్యల దగ్గర కొంత సమయం గడిపి, వారికి రకరకాల సేవలు చేసేలా ప్రోత్సహించాలి. వారి జీవితానుభవాలు, అప్పట్లో పరిస్థితులు, జీవనశైలి, చదువులు, సంస్కృతి, డబ్బు విలువ గురించి తెలుసుకునేలా చేయాలి. తోటివారికి సాయపడటం, ఇంటి,పొలం పనులపై అవగాహన కల్పించాలి. కుదిరితే సాయంత్రం వేళ గ్రామాల్లో తిప్పుతూ ప్రకృతిని ఆస్వాదించేలా చూడాలి.

ఇంటి పట్టు ఆటలు మేలు
పిల్లలను సెల్‌ఫోన్ వినియోగానికి వీలైనంత దూరంగా ఉంచి ఇంటి పట్టు ఆటల వైపు మళ్లించాలి. అష్టాచెమ్మా, పైలా.. పచ్చీసు, పులి-మేక, వైకుంఠపాళీ, దొంగ-పోలీసు వంటి ఆటలను పరిచయం చేసి ఆడేలా చూడాలి. వాటితో కూడా మెదడుకు పదును, ఆలోచన శక్తి పెంపొందించుకునే అకాశం ఉంటుందని తెలియజెప్పాలి.

మన ప్రత్యేకతలు తెలియజేద్దాం
చిన్నారులకు జిల్లాలోని ప్రముఖ ప్రదేశాలు, ప్రత్యేకతలపై అవగాహన కల్పించాలి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్, గుర్రంకొండకోట, ఒంటిమిట్ట రామాలయం, పుష్పగిరి, నందలూరు సౌమ్యనాథ ఆలయంలతో పాటు మదనపల్లెలోని ఆరోగ్యవరం, టమాటా మార్కెట్, బీటీ కాలేజీ తదితర ప్రదేశాలకు తీసుకెళ్లి చరిత్రను తెలియజేస్తే కొత్త విషయాలు తెలుసుకుంటారు.

ఇవి చేయొచ్చు

- వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలకు తీసుకెళ్లి అక్కడి స్థితులు చూపించి బంధాల గురించి వివరించాలి.
- ఆసక్తి ఉన్న రంగాల గురించి తెలిపే వ్యవస్థలు, బ్యాంకులు, తపాలా కార్యాల యాలు, రైల్వేస్టేషన్, బస్టాండ్లకు తీసుకెళ్లి అక్కడ ఎలాంటి సేవలు లభ్యమవుతాయి, ఎలా వినియోగించుకోవాలో చెప్పొచ్చు.
- స్వచ్ఛంద సంస్థలు చేసే సేవా కార్యక్రమాల్లో పిల్లలను భాగస్వామ్యం చేస్తే వారిలో సేవాభావం పెంపొందుతుంది.
- ఇంటి పరిసరాలను పిల్లలతో శుభ్రం చేయించడం, కూరగాయలు, పూల, పండ్ల మొక్కలను కొత్తగా నాటించడం, ఇప్పటికే ఉన్న వాటికి రోజు నీరు పోసేలా చూడటం కూడా చేయొచ్చు.
- ఉదయం, సాయంత్రం వేళల్లో యోగా, ప్రాణాయామం, ధ్యానం సాధన చేయడాన్ని అలవాటు చేయాలి.
- ఏదో ఒక కళలో తర్ఫీదు ఇప్పించే ప్రయ త్నం చేయాలి. కథలు చెప్పడం, సంగీతం, నృత్యం, ఆటలు వంటివి నేర్పించొచ్చు.

సెల్‌ఫోన్ వినియోగంతో ఏకాగ్రతకు దెబ్బ



ప్రస్తుతం ఉన్న పోటీ ప్రపంచంలో పిల్లలు చదువుల్లో రాణించాలంటే ఏకాగ్రత చాలా అవసరం. సెల్‌ఫోన్ ఎక్కువగా వినియోగిస్తే ముందుగా దెబ్బతినేది ఏకాగ్రతే. ఫోన్‌లకు ఎక్కువ అలవాటు పడితే సమయానికి నిద్రపోరు, మెదడు చురుగ్గా పని చేయదు. అదే పనిగా స్క్రీన్ చూస్తుండటం వల్ల దృష్టి లోపం, తల నొప్పి వస్తాయి. శారీరక శ్రమ లేకుండా వాటికే అతుక్కుపోవడం వల్ల ఊబకాయం బారిన కూడా పడే ప్రమాదం ఉంది. వేసవిలో పిల్లలు సెల్‌ఫోనులు, టీవీలకు పరిమితం కాకుండా తల్లిదండ్రులే చూసుకోవాలి. వేసవి శిక్షణా శిబిరాలకు పంపితే ప్రయోజనం ఉంటుంది.
–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

తల్లిదండ్రులదే బాధ్యత



విద్యార్థులు తమ సెలవులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు సమయం పట్టిక పిల్లలనే వేసుకోమని, దాన్ని పకడ్బందీగా అమలు చేసేలా పర్యవేక్షించాలి. ఇష్టానుసారంగా స్వేచ్ఛగా వదిలేస్తే మాత్రం తర్వాత రోజుల్లో ఇబ్బంది పడాల్సి వస్తుంది.
–లలితమ్మ, ఫోర్డు స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, మదనపల్లె

క్లుప్తంగా

వేర్వేరు ఘటనల్లో ఇదరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన సురేష్ భార్య గంగాభవాని(22) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా తట్టివారిపల్లెకు చెందిన జయచంద్రారెడ్డి(36) కుటుంబ సమస్యలతో జిల్లేడు ఆకులు తిని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబసభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు గ్రామాల్లో ఇద్దరు అదృశ్యం

మదనపల్లె : వేర్వేరు ఘటనలకు సంబంధించి రెండు మిస్సింగ్ కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. చంద్రాకాలనీకి చెందిన మోహన్ నాయక్ భార్య వి.మీనా(24) ఈ నెల 14న బట్టలు ఇస్త్రీ చేసుకుని వస్తానంటూ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం మోహన్‌నాయక్ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే విధంగా అనపగుట్టకు చెందిన ఎస్.సయ్యద్‌మీర్(55) ఇంటి నుంచి వెళ్లి గత రెండు నెలలుగా కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో అతని కూతురు అమీషా మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

మదనపల్లె : ప్రమాదశాత్తు బైక్‌పై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. నాయునివారిపల్లెకు చెందిన ఎస్.వెంకటాచలపతి(50) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా, కురబలకోట సమీపంలోని ఫ్లై ఓవర్ వద్ద మరో ద్విచక్ర వాహనం అకస్మాత్తుగా వెనకకు తిరగడంతో సడెన్ బ్రేక్ వేసిన వెంకటాచలపతి అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

పంట మారుద్దాం.. దిగుబడి పెంచుదాం

ప్రతి సారీ ఒకే రకం పంటను సాగు చేయడంతో భూసారం తగ్గడంతోపాటు చీడ పీడలు ఆవహిస్తున్నాయి. చాలా మంది రైతులు నేటికీ ఒకే రకమైన పంట పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. పొలాల్లో భూసారం తగ్గి రోగాలను కలిగించే పురుగుల సంఖ్య పెరుగుతోంది. ఏటేటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే వీలుంటుంది. భూమిలోని పోషకాలు సమృద్ధిగా అందుతాయి. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు ఇవేం..

- ఒకే రకం పంట సాగుతో రైతుకు నష్టాలు
- చిరుధాన్యాల పంటలతో భూసారం పెంపు


కొత్తపల్లెలో సాగు చేసిన జొన్న పంట


మొరంపల్లెలో సాగు చేసిన రాగిపంట

గుర్రంకొండ : అన్నమయ్య జిల్లాలోని పడమటి ప్రాంతాల రైతులు సాగు కాలం ముగిసిన తర్వాత రెండు నుంచి మూడు నెలలు విరామం ఇచ్చి అదే నేలలో మళ్లీ గతంలో సాగు చేసిన రకం పంటనే సాగు చేస్తుంటారు. దీంతో నాణ్యత కలిగిన నేలలోనైనా దిగుబడి తగ్గి, చీడపీడలు ఎక్కువై రైతులు నష్టపోతున్నారు. భూమిలో భుసారం తగ్గి నష్టాల బాట పడుతున్నారు. అయితే ఏడాదిలో రెండు నుంచి మూడు రకాల పంటలు సాగు చేస్తే ఆధిక దిగుబడులతోపాటు లాభాలు వచ్చే అవకాశముందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. చిరు ధాన్యాల పంటల సాగుతో పొలాల్లో భూసారం పెరుగుతుందని, ఎంతటి సారవంతమైన పొలాల్లో అయినా ఒకే రకం పంట సాగు చేస్తే నష్టాలే మిగుతాయని హెచ్చరిస్తున్నారు.

మారుతున్న ఆలోచనా విధానం

ఒకే రంగ పంట సాగు చేయకుండా రైతుల ఆలోచనా విధానం మార్చుకోవాల్సిందే. రైతులు గతంలో వేసిన ప్రధాన పంటకు భిన్నంగా పెరిగే పైరు ఎంచుకోవాల్సి ఉంటుంది. భూమికి సత్తువ, పోషకాలనిచ్చే పైరును ఎంచు కోవడంతో లాభం ఉంటుంది. ఈ పద్ధతితో పైరు ఆకు రాల్చి, భూమికి సేంద్రియ పదార్థాలు అందజేస్తాయి. సూక్ష్మ జీవుల చర్య ఫలితంగా ఎంజైములు ఉత్పత్తి అవుతాయి. విభిన్న పంటల సాగుతో పైరుకు కొంత మేరకు నత్రజని ఎరువు లభిస్తుంది. కంది, శెనగ పైర్లు వరుసగా వేస్తే కాయతొలుచు పురుగుల తాకిడి అధికంగా ఉంటుంది. అదే జొన్న, సజ్జ, రాగి, సోయాచిక్కుడు, నువ్వులు, మినుము, ఉలవ పంటల సాగుతో పంట మార్పిడి చేసుకుంటే రైతులకు లాభముందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయంతో ఫలితాలు

టమాటా సాగు చేసే రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ఫలితం ఉటుంది. ఆవాలు, బంతి, ధాన్యపు పంటలతో పంట మార్పిడి చేస్తే నులిపురుగుల ఉద్ధృతి తగ్గుతుంది. వేరుశెనగ పైరుకు నులిపురుగుల బెడద ఉండదు. వంగ తోటలు సాగు చేసే అన్నదాతలు క్యాలీ ఫ్లవర్ సాగు చేయడం ద్వారా ఎండు తెగులు రాదని పొలంలో భూసారం పెంపొందుతుందని చెబుతున్నారు. భూసారం పెరగడంతో పంట సాగులో చీడపీడల బాధ కొంతవరకు అరికట్టవచ్చు. ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు తప్పనిసరిగా పంటమార్పిడి అనుసరిస్తే మంచి ఫలితాలతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చు.

చిరుధాన్యాల సాగుతో భూసారం పెంపు

చిరు ధాన్యాల పంటల సాగుతో పొలాల్లో భూసారం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ ఎక్కువగా సేంద్రియ ఎరువులే రైతులు వినియోగిస్తుంటారు. తద్వారా పొలాల్లో సహజ సిద్ధమైన భూసారం పెరుగుతుంది. చిరుధాన్యాల పంట కాలం ముగిసి కోతల తర్వాత పొలాల్లో చేసే దుక్కులతో ప్రయోజనం ఉంటుంది. పంట కాలం ముగిసి నెలరోజుల గడువు తరువాత పైనున్న చిరుధాన్యాల పంట మొదళ్లు, అప్పుడప్పుడే మొదలైన చిగుర్లు భూమి లోపల చేరుకొంటాయి. అనంతరం కుళ్లి మంచి ఎరువుగా మారి పొలంలో భూసారం పెరుగుతుంది. తద్వారా చిరుధాన్యాల పంట కాలం ముగిసిన తరువాత సాగు చేసే ఎ రకం పంటకైనా మంచి పోషకాలు లభిస్తాయి.

పంటమార్పిడితో రైతుకు లాభాలు



పంట మార్పిడితో రైతులకు ఎన్నో లాభాలున్నాయి. భూసారం పెరగడంతోపాటు పంటలకు మంచి పోషకాలు లభిస్తాయి. చీడ పీడల నివారణ, పంట పోషకాలకోసం ఖర్చు తగ్గుతుంది. రైతులు తప్పనిసరిగా ఈ పద్ధతిని అనుసరిస్తే లాభపడతారు. ఇప్పుడిప్పుడే రైతులు పంటల మార్పిడి పద్ధతికి అలవాటు పడుతున్నారు.

– రత్నమ్మ, వ్యవసాయాధికారిణి, గుర్రంకొండ

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

– పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు



రాజంపేట టౌన్ : జిల్లాలోని మూడు ప్రభుత్వ, పన్నెండు ప్రైవేట్ ఐటీఐలలో ప్రవేశాలకు జూన్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్, రాజంపేట ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు తెలిపారు. రాజంపేటలోని తన కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాజంపేట, పీలేరు, తంబళ్లపల్లెలో ప్రభుత్వ ఐటీఐలలో 392 సీట్లు, ప్రైవేట్ ఐటీఐల్లో 1,064 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్‌మోటార్ వెహికల్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, వైర్‌మెన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ట్రేడ్ కోర్సుల్లో ప్రవేశాలకు పది ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కోపా ట్రేడ్‌కు పది, వెల్డర్, వైర్‌మెన్ ట్రేడ్‌లలో ప్రవేశానికి 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఐటీఐలో చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు httpr://iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా జూన్ 10వ తేదీలోపే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో ఉచితంగా దరఖాస్తు చేయించే సౌకర్యాన్ని కల్పించామన్నారు.

సింహ వాహనంపై చెన్నకేశవుడు


సింహవాహనంపై ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వాముల వారికి విశేష అభిషేకాలు, అర్చన చేసి అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామిని పల్లకిలో ఊరేగించారు. రాత్రి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను సింహ వాహనంపై ఆశీనులను చేసి ఆలయ మాడ వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఆలయ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు స్వాములను దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామ్మోహన్, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నందివాహనంపై అగస్త్యేశ్వరస్వామి


నంది వాహనంపై శ్రీగంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం వేకువ జామున అగస్త్యేశ్వర స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి అలంకరించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవమూర్తులను నంది వాహనంపై, అభయ వరద సీతారామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. యడవల్లి రమణయ్య పర్యవేక్షణలో యడవల్లి యశ్వంత్‌కుమార్, జానకి బృందం, శ్రీచాయాపతి పావని గ్రూప్ వారిచే శివ భక్తి గానలహరి అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ, ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

మిట్టపల్లెలో పిడుగుపాటు


మిట్టపల్లెలో పిడుగు పడిన ప్రాంతం


పిడుగుపాటుకు చనిపోయిన పాడి ఆవులు

సిద్దవటం : మండలంలోని పెద్దపల్లె గ్రామ పంచాయతీ మిట్టపల్లె గ్రామంలో పిడుగుపాటుకు ఎగిరిన గుళక రాళ్లు తగిలి కాడే వెంకటస్వామికి స్వల్పగాయాలయ్యాయి. మంగళవారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసి... మిట్టపల్లె దేవాలయం ఎదురుగా ఉన్న పాత నీటి ట్యాంకు బేసిమట్టంపై పిడుగు పడింది. గుళకరాళ్లు ఎగిరి 20 మీటర్ల దూరంలో ఉన్న వెంకటస్వామికి తగిలి స్వల్పంగా గాయపడ్డారు. పిడుగు శబ్దానికి భయపడి మరి కొందరు దేవాలయంలోకి పరుగులు తీసినట్లు స్థానికులు తెలిపారు.

రెండు ఆవులు మృతి

కురబలకోట : మండలంలోని వనమరెడ్డిగారిపల్లె గ్రామం కోనంగివారిపల్లెలోని తలారి రెడ్డెప్పకు చెందిన రెండు పాడి ఆవులు పిడుగుపాటుకు చనిపోయాయి. మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కువడంతో ఆవులను ఊరి పక్కన చెట్టు కింద కట్టేశారు. ఉన్నపాటుగా పిడుగు పడటంతో రెండు ఆవులు చనిపోయాయి. రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధితుడు తెలిపారు. పాలిచ్చే ఆవులు చనిపోవడంతో ఆధారం కోల్పోయాని రెడ్డెప్ప ఆవేదన వ్యక్తం చేశారు.

ఉరి వేసుకుని ఎలక్ట్రీషియన్ ఆత్మహత్య


మహబూబ్‌బాషా (ఫైల్)

మదనపల్లె : ఉరివేసుకుని ఎలక్ట్రీషియన్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె వెంకటేశ్వరపురంలో నివాసముంటున్న మిఠాయి వ్యాపారి హైదర్‌వలి, దిల్‌షాద్ దంపతుల కుమారుడు ఎస్.మహబూబ్‌బాషా(29) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం చీకలగుట్టకు చెందిన సమియా సుల్తానాను మొదటి వివాహం చేసుకోగా, వీరికి నాసిర్(5) కుమారుడు ఉన్నాడు. ఆమెతో విభేదాలు వచ్చి రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. ఈ క్రమంలో మూడునెలల క్రితం కోళ్లబైలు పంచాయతీ బయ్యారెడ్డికాలనీకి చెందిన దస్తగిరి, అంబాజీల కుమార్తె భానును రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో నెలరోజుల నుంచి ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. పది రోజులుగా మహబూబ్‌బాషా భార్య దగ్గరకు వెళ్లకుండా తండ్రితో కలిసి మిఠాయి వ్యాపారానికి వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం అత్తగారిల్లు అయిన బయ్యారెడ్డి కాలనీలోని భార్య వద్దకు వెళ్లాడు. నగదు విషయమై భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన మహబూబ్‌బాషా అక్కడే ఇంట్లో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తమ కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని అతడి తల్లిదండ్రులు పోలీసులను కోరారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు.

7న దళితమిత్ర రాష్ట్ర మహా సభ


సన్నాహక సమావేశంలో పాల్గొన్న దళితమిత్ర సంఘం ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆంధ్ర ప్రదేశ్ దళితమిత్ర సంఘం రాష్ట్ర మహాసభ అక్టోబరు 7న నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామాంజనేయులు అన్నారు. కడప నగరంలోని ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం జిల్లా పామిడిలో రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నామని తెలిపారు. వివిధ జిల్లాలు, మండలాల కమిటీల ఏర్పాటు గురించి సంఘం నాయకులతో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ జిల్లాల నుంచి కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రమేష్, అధికార ప్రతినిధి పెడబల్లె నాగభూషణం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల ఇన్‌ఛార్జులు లేపాక్షి ఓబులేస్, మహిళా సమాఖ్య అధ్యక్ష, ఉపాధ్యక్షులు బుజ్జమ్మ, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఫర్నిచర్ ధ్వంసం కేసులో ఐదుగురి అరెస్టు


పోలీసుల అదుపులో నిందితులు

రాయచోటి టౌన్ : ఈ నెల 16వ తేదీన రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు ఇంటిలోకి చొరబడి వాహనాలు, ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనలో 15న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం మరో ఐదుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. స్కార్పియో ఏపీ03బివి 2226 జీపును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులకు ఈ నెల 29వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో పప్పిరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మీసాలరెడ్డి శ్రావణ్, కాలేపల్లె వెంకట శివారెడ్డి, ముదిరిన రారాజు, పసుపులేని శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ చోరీ


ధ్వంసం చేసిన హుండీ

కలకడ : గుడి తాళం ధ్వంసం చేసి ఆలయంలోని హుండీని చోరీ చేసిన సంఘటన కలకడ మండలం నవాబుపేట పంచాయతీ చావిడికాడపల్లె సమీంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చావిడికాడపల్లెలోని మల్లికార్జునస్వామి ఆలయంలో పాపిరెడ్డి గారిపల్లె కు చెందిన ఆలూరి రఘురామశర్మను పూజారిగా నియమించారు. శనివారం సాయంత్రం వరకూ ఉన్న హుండీ సోమవారం పూజారి వెళ్లి చూడగా అక్కడ లేదు. ఆలయ తాళాలు ధ్వంసం చేసి హుండీ చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కంటి క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

– నిపుణులు డాక్టర్ కావ్య ఎం.బెజ్జంకి

కడప కోటిరెడ్డిసర్కిల్ : రె టినో బ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్‌పై పిల్లల తల్లితండ్రులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కంటి కేన్సర్ నిపుణులు డాక్టర్ కావ్య ఎం.బెజ్జంకి తెలిపారు. ప్రపంచ రెటినో బ్లాస్టోమా కంటి క్యాన్సర్ అవగాహన వారోత్సవం సందర్భంగా మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్(ఎల్వీపీఈఐ) ఆధ్వర్యంలో ఏటా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రతి ఏడాది వైట్ థాన్ పేరిట పరుగు, నడక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కంటి క్యాన్సర్‌కు అత్యంత ఖరీదుతో కూడిన దీర్ఘకాల వైద్య సేవలు పొందాల్సి ఉంటుందన్నారు. 'వైటాథాన్' ద్వారా సేకరించిన నిధులతో 2000 మందికి చికిత్స అందిస్తున్నామన్నారు. రెటినోబ్లాస్టోమాను ముందుగానే గుర్తించి, చికిత్స చేస్తే పిల్లల దృష్టిని కాపాడవచ్చని తెలియజేశారు.

కూలిన విద్యుత్తు స్తంభం



పెద్దముడియం : మండలంలోని బలపనగూడూరు సమీపంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలకు విద్యుత్తు స్తంభం కూలిపోయింది. రెండు మేకలు స్తంభం కింద పడి మృతి చెందాయి. స్తంభం కూలుతున్న సమయంలో 20 అడుగుల దూరంలో ప్రయాణికులతో కూడిన ఆటో బలపనగూడూరు గ్రామానికి వస్తోంది. కొన్ని సెకన్ల ముందే స్తంభం కూలిపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి ప్రమాదం జరగక ముందే వంగిపోయిన స్తంభాలను సరిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాయ్ రాజా కాయ్...

- కూటమి మంత్రివర్గంలో జహాకు ఛాన్స్ అంటూ అనుకూల కథనం
- తామే గెలుస్తున్నామంటూ అమాయకులను మభ్యపెట్టే యత్నం



అనుకూల మీడియాలో టీడీపీ అభ్యర్థికి మద్దతుగా సాగిస్తున్న ప్రచారం

మదనపల్లె : 'ఆలు లేదు. చూలు లేదు. కొడుకు పేరు సోమలింగం' అన్న చందంగా మదనపల్లెలో ఎన్నికల బెట్టింగ్ కొనసాగుతోంది. తమ అభ్యర్థికి మంత్రివర్గంలో కీలకపదవి వచ్చేసిందంటూ అనుకూల మీడియాలో కథనాలు ప్రచారం చేయించి, బెట్టింగ్ జోరును పెంచేస్తున్నారు. అమాయకులు జోరుగా సాగుతున్న ప్రచారం, వాట్సాప్ గ్రూపుల్లో వస్తున్న అసత్య కథనాలను నమ్మి.. అప్పుచేసి మరీ లక్షల రూపాయలు బెట్టింగ్ కడుతున్నారు. మదనపల్లె నియోజకవర్గంలో ఎక్కడా నలుగురు గుమికూడినా వీటిపైనే చర్చ జరుగుతోంది. టీ, టిఫిన్ హోటల్స్, కాఫీ షాపులు, డాబాలు తదితర ప్రాంతాల్లో నమ్మకం ఉన్న కొందరితో తప్పుడు ప్రచారాలు చేయిస్తూ... బెట్టింగ్‌లకు ఉసిగొల్పి, కుటుంబాలను గుల్లచేసే పనులకు టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. తమ అన్న భారీ మెజారిటీతో గెలిచిపోయాడని, జూన్ 4 తర్వాత ఏకంగా మంత్రి కాబోతున్నారని...తాము పందెం కాసామని, మీరు వేసుకోవాలని ఆశ పెడుతున్నారు. కావాల్సి వస్తే పలానా వ్యక్తి దగ్గర అప్పుతీసి ఇస్తామని చెప్పి మరీ ఊబి లోకి దించుతున్నారు. వాస్తవానికి టీడీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేస్తున్న ఫేక్ సర్వేల్లోనే మదనపల్లెలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఉన్నప్పటికీ, అవేవీ బయటపెట్టకుండా, ఎదుటివాడిని మోసగించడమే ధ్యేయంగా, కమీషన్లకు కక్కుర్తి పడి అమాయకులను మోసగించే ప్రయత్నాలు చేస్తున్నారు.

గడువు దాటిన సిలిండర్‌తో జాగ్రత్త..!

- అప్రమత్తతతో ప్రమాదాలు దూరం
- గడువు తేదీపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలతో గృహిణులకు లాభం

ఎర్రగుంట్ల : నిత్యావసరాల్లో వినియోగించే ప్రతి వస్తువుకూ గడువు తేదీ ఉంటుంది. కాలం చెల్లిన ఈ సిలిండర్ వినియోగించడం ప్రమాదకరం. వినియోగదారులు దీనిపై అవగాహన పెంచుకుంటే ప్రమాదం నుంచి బయటపడే అవాశం ఉంటుంది.

గడువు తీరితే ప్రమాదమే...

గ్యాస్ సిలిండర్‌ను నెలల తరబడి వాడకుండా నిల్వ ఉంచుతారు. మరింత మంది బ్లాక్‌లో కొని వాడుతుంటారు. అయితే సిలిండర్‌పై గుర్తించిన గడువు తేదీ లోపు వాడితే ఉత్తమం. కాలం చెల్లిన సిలిండర్లు వాడితే ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటున్నాయని నిపుణులు చెబుతున్నారు. అలాంటి వాటిని సంబంధిత డీలర్‌కు తిరిగి ఇచ్చేయాలి.

ముగింపు తేదీని గుర్తించాలిలా..

ప్రతి ఇంట్లో ముఖ్యమైన వస్తువు గ్యాస్ సిలిండర్. ముందుగా గ్యాస్ సిలిండర్ గడువు తేదీ గుర్తించాలి. రింగ్‌కు కింది భాగంలో తేదీ ముద్రించి ఉంటుంది. ఏడాదిలోని 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఆంగ్ల భాషలోని ఏ, బి, సి, డి అక్షరాలను రాస్తారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు ఎ, ఏప్రిల్, మే, జూన్ నెలలను 'బి', జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలలకు, 'సి', అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు 'డి' రాస్తారు. ఉదాహరణకు సిలిండర్‌పై బి-17 అని రాసి ఉంటే అది 2017 జూన్ వరకే వినియోగించాలని అర్థం. ఆ నెల దాటితే సిలిండర్ కాలం చెల్లిందని తెలుసుకుని దూరంగా పెట్టాలి. ఖాళీ సిలిండర్లకు నిర్దిష్ట కాలపరిమితి ఉంటుంది. ఇది వినియోగదారులకు సంబంధం లేదు. తయారీదారులు తమ వద్ద రికార్డుల్లో లేని బ్యాచ్ నంబర్ల ప్రకారం ఏడేళ్లు దాటిన వాటిని వెనక్కు తెప్పించుకుని పరీక్షించి, నాణ్యత లేని వాటిని పక్కన పెట్టేస్తారు.



సిలిండర్‌పై ఉన్న ఎక్స్‌పైరీ తేదీ గుర్తించాల్సిన చోటు ఇదే..